నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
8 | వరంగల్, ఆదివారం 11 మే 2025 | MAHABUBABAD

## పలుకుబడి ఉన్నోళ్లవే ముందు కాంటా పెడుతారా?



తూర్పుతండా ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

దంతాలపల్లి, మే 10 : ధాన్యం కాంటాల విషయంలో నిర్వాహకులు క్రమపద్ధతి పాటించడం లేదని రైతులు ఆందోళనకు దిగారు. మండలంలోని తూర్పుతండాలో ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో రోజులు గడుస్తున్నా కాంటాలు పెట్టకుండా పలుకుబడి ఉన్న వారివి, డబ్బులు ఇచ్చిన వారివే ముందు కాంటాలు పెట్టి తరలిస్తున్నారని శనివారం నిరసన తెలిపారు. బస్తాలను మిల్లులకు తరలించకుండా ప్రైవేట్ దళారులకు ఇష్టానుసారం ఇస్తూ కేంద్రంలో ఉన్న రైతులకు పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు నిర్వాహకుడితో మాట్లాడి రైతులను నచ్చజెప్పడంతో శాంతించారు.

## మాకు చెప్పకుండా తరలిస్తే ఎలా?



అధికారులను ప్రశ్నిస్తున్న హరిపిరాల రైతులు

తొర్రూరు, మే 10 : తొర్రూరు మండలంలోని హరిపిరాల ఐకేపీ సెంటర్ బస్తాల తరలింపుపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బార్దన్లు లేక కాంటాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు బార్దన్లు లేక ఇబ్బందులు పడుతుంటే వచ్చే సంచులను చీకటాయపాలేనికి ఎలా పంపుతారంటూ అధికారులను రైతులు నిలదీశారు. తమ చెప్పకుండా తరలించడం అన్యాయమని తమ గ్రామానికి రావాల్సిన సంచులు ఇతర గ్రామానికి ఎలా వెళ్తాయని ప్రశ్నించిన రైతులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన అధికారులు సెంటర్ ఇన్‌చార్జి ధనుంజయని తొలగించారు.

# విజయ సిందూరం



*మన ఆడబిడ్డలను కన్నీళ్లు పెట్టించిన పాకిస్థాన్ ఉగ్రమూకలను భారత సైన్యం మట్టుబెట్టింది. మళ్లీ భారతావని వైపు చూడాలంటే పాక్ వెన్నులో వణుకు పుట్టేలా 'ఆపరేషన్ సిందూర్'తో చావు దెబ్బ కొట్టింది. మన దగ్గర అత్యాధునిక ఆయుధ సంపత్తి ముందు పాకిస్థాన్ నిలువ లేదని మరోసారి నిరూపించింది. ఈ ఆపరేషన్ దేశ ప్రజల్లో ధైర్యం, ఆత్మవిశ్వాన్ని నింపిందని మన మాజీ జవాన్లు దేశ సైన్యాన్ని ప్రశంసిస్తున్నారు. దేశం పిలుపునిస్తే తామూ యుద్ధంలో పాల్గొందుకు సిద్ధం అంటున్నారు.*

- పాక్ ఉగ్రమూకల వెన్ను విరిచిన కేంద్ర బలగాలు
- మళ్లీ యుద్ధమంటే వణుకుపుట్టేలా దెబ్బ తీసిన భారత సైన్యం
- 'ఆపరేషన్ సిందూర్' దేశ ప్రజల్లో ధైర్యం నింపిందంటున్న మాజీ జవాన్లు

## ఒకే రోజు 35 డ్రోన్లు కూల్చేశాం..



భీమదేవరపల్లి, మే 10 : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్ సరిహద్దు రాజస్థాన్ రాష్ట్రంలోని గంగానగర్‌లో డ్యూటీ చేస్తున్నా. శత్రుమూకలను సమర్థవంతంగా ఎదుర్కొని తిప్పికొడుతున్నాం. పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతం మనదేశంలోని గ్రామాలను కేంద్రప్రభుత్వం బ్లాక్ అవుట్ చేసింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో డ్రోన్లను ఎదుర్కోవడం సాధ్యమవుతున్నది. ఇండ్లల్లో ఇన్వర్టర్లు ఉన్నవారిని కూడా లైట్లు వేయొద్దని చెబుతున్నాం. లైట్ల ద్వారా వచ్చే వేడిమి వల్ల డ్రోన్లకు ఆచూకీ అలవోకగా తెలుస్తుంది. అందుకే కంటికి రెప్పలా గస్తీ కాస్తున్నాం. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దీటుగా సమాధానం ఇస్తున్నాం. శుక్రవారం ఒక్క రోజే 35 వరకు డ్రోన్లను కూల్చివేశాం. 20 ఏళ్ల క్రితం బీఎస్ఎఫ్‌లో శిక్షణ పొందాను. పాకిస్తాన్ సరిహద్దులోని రాజస్తాన్‌లో రెండేళ్లు, బంగ్లాదేశ్ సరిహద్దులోని నార్త్ బెంగాల్‌లో ఐదేళ్లు, ఛత్తీస్‌గఢ్‌లోని నక్సలైట్ ఏరియాలో నాలుగేళ్లు, మూడేళ్లు వెస్ట్ బెంగాల్‌లో, ప్రస్తుతం రాజస్తాన్‌లోని గంగానగర్‌లో విధులు నిర్వర్తిస్తున్నా. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని నిరుపేద కుటుంబంలో పుట్టిన నేను కంసాలి పని చేసుకుంటూ కాలం వెల్లదీసేవాన్ని. అలాంటి నాకు బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం వచ్చింది. 20 ఏళ్లుగా దేశ రక్షణ కోసం తుపాకీ పట్టుకోవడం గర్వంగా ఉంది.

*–శ్రీరామోజు కృష్ణ, హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, ముల్కనూరు*

## మురళీనాయక్ త్యాగం మరువలేనిది..

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

జనగామ, మే 10 (నమస్తే తెలంగాణ) : జమ్మూ కాశ్మీర్‌లో భారత్–పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ మురళీనాయక్ వీరమరణం చెందడంపై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 25 ఏళ్ల వయసులోనే మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన ఆయన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ శనివారం ఒక ప్రకటనలో ఘన నివాళులర్పించారు.



*ఖిలావరంగల్: చింతల్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజలు*

## తగిన మూల్యం చెల్లించుకున్నది



ఇనుగుర్తి, మే10: ఆర్మీ పిలిస్తే యుద్ధంలో పాల్గొంటా. భరతమాత కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నా. 1989 నుంచి 2019 వరకు 30 సంవత్సరాలు దేశ రక్షణకు బోర్డర్‌లో పనిచేశా. 1999 కార్గిల్ యుద్ధ సమయంలో జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో పాకిస్థాన్‌తో పోరాడాను. ఆ సమయంలో మాకు బోఫోర్స్ గన్స్ ఎక్కువగా ఉపయోగపడ్డాయి. గతంతో పోల్చితే ఇప్పుడు భారత్ వద్ద అత్యంత ఆధునికమైన, శక్తివంతమైన ఆయుధ సంపత్తి ఉన్నది. ఎస్ 400 రక్షణ వ్యవస్థ పనితీరు అద్భుతం. పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకున్నది.

*– శీలం మధుసూదన్‌రెడ్డి, ఆర్మీ మాజీ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్, ఇనుగుర్తి మండలం, మహబూబాబాద్ జిల్లా*

## పాకిస్థాన్‌కు పరాభవం తప్పదు



నర్సింహులపేట, మే 10: 1972లో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం వచ్చింది. భారత్ ఎప్పుడు ఎలాంటి యుద్ధం వచ్చినా వెనకడుగు వేయలేదు. పాకిస్థాన్, చైనా బోర్డర్‌లో విధులు నిర్వర్తించా. జమ్మూకశ్మీర్, పంజాబ్, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీలో 24 ఏళ్ల పాటు పని చేశా. నేను ఉద్యోగం చేసేటప్పుడు రాత్రి, పగలు రహదారులను పరిశీలిస్తూ, అర్ధరాత్రి చీకట్లో చిన్నచిన్న దీపాలు పట్టుకొని కాపాలా ఉండేవాళ్లం. పాకిస్థాన్ కవ్వింపు చర్యలు చూస్తే మళ్లీ బీఎస్ఎఫ్‌లో వెళ్లాలనిపిస్తున్నది. కానీ, ఇప్పుడు నా వయస్సు 73 సంవత్సరాలు. భారత్‌తో పెట్టుకుంటే ఓటమి తప్పదు.

*– అజ్మీరా సత్యనారాయణ, రిటైర్డ్ బీఎస్ఎఫ్ ఉద్యోగి, నర్సింహులపేట*

## యుద్ధం దేశ ప్రజల్లో ధైర్యం నింపింది..



సుబేదారి, మే 10 : మాది హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామం. నేను 2001లో ఆర్మీలో సైనికుడిగా చేరాను. 2019లో హవల్దార్ హోదాలో రిటైర్డ్ అయ్యాను. ఎక్కువ కాలం ఆర్మీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేశా. 2007 నుంచి 2009 వరకు జమ్ములోని పాకిస్థాన్ సరిహద్దు రజోరీ జిల్లా తానమాడి ప్రాంతంలో రాష్ట్రీయ రైఫిల్ విభాగంలో పనిచేశా. 18 ఏళ్లు ఆర్మీలో పని చేసి రిటైర్డ్ అయ్యాను. మన దేశ ఆడబిడ్డల సిందూరాన్ని తుడిచివేసిన పాకిస్థాన్ ఉగ్రమూకలకు కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్'తో గట్టి సమాధానం చెప్పింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని తొమ్మిది పాక్ ఉగ్రవాదుల స్థావరాలను పిన్‌పాయింట్‌గా మన గగనతల క్షిపణి దళాలు నేలమట్టం చేశాయి. పాకిస్థాన్‌కు మనమంటే ఏంటో రుచి చూపించాయి. ఈ ఆపరేషన్ భారత ప్రజల్లో ధైర్యం, సాహసం నింపింది. మనతో పెట్టుకుంటే నాలుగు రోజుల్లోనే పాకిస్థాన్ కుప్పకూలుతుంది. యుద్ధం తీవ్రతరమైతే పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సైనిక బోర్డు నుంచి ఎప్పుడు పిలుపు వచ్చినా దేశం కోసం పాకిస్థాన్‌తో యుద్ధం చేయడానికి వెళ్తా.

*– రిటైర్డ్ ఆర్మీ జవాన్ కావటి భిక్షపతి*

## భారత సైన్యం ముందు పాక్ నిలువలేదు



ఖానాపురం, మే 10 : భారత సైన్యం ముందు పాకిస్థాన్ సైన్యం నిలువలేదు. పాకిస్థాన్‌తో పూర్తిస్థాయిలో యుద్ధం చేస్తే 24 గంటల్లోనే ఆ దేశాన్ని మట్టుపెట్టగల శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయి. 2001 నుంచి 2025 వరకు ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి, ఇటీవలే రిటైర్డ్ అయ్యా. దేశం కోసం పిలుపు వస్తే తిరిగి విధుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నా. 2003 నుంచి 2006 వరకు జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వర్తించా. అక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. పాకిస్థాన్ సైనికులు కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంటారు. నేరుగా యుద్ధం చేసే ధైర్యం వారికి లేదు. టెర్రరిస్టులను షెల్టర్ ఇచ్చి, వారిని కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం భారత్ వద్ద అధునాతన ఆయుధ సంపత్తి ఉన్నది. నాకు యుద్ధంలో నేరుగా పాల్గొనే అవకాశం రాలేదు. ఇప్పుడు వచ్చినా సంతోషమే. భరతమాత కోసం సదా సిద్ధంగానే ఉంటా.. ఈ సారి పాకిస్థాన్‌తో తాడోపేడో తేల్చుకోవాలి. మళ్లీ భవిష్యత్‌లో పాకిస్థాన్ భారత్‌తో యుద్ధం అంటేనే వణికిపోవాలి.

*– రిటైర్డ్ హవల్దార్ కుందెనపల్లి రమేశ్*




# బార్దన్లు లేవు.. కాంటాలు పెట్టరు!

### ఈసారి కాలం కలిసిరాకపోయినా

**సాగునీటి కష్టాలను అధిగమించి వరి పండించిన రైతు.. ఆ పంటను అమ్ముకునేందుకూ పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. అకాల వర్షాలతో ఇప్పటికే ఆగమైన అన్నదాతకు కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాల్లో బార్దన్లు లేక, కాంటాలు కాక రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. అంతేగాక తేమ శాతం పేరుతో కొర్రీలు, కోతలు పెట్టడం, కొన్న తర్వాత వడ్లను తరలించే విషయంలోనూ అటు నిర్వాహకులు, మిల్లర్లు, అధికారుల అంతులేని నిర్లక్ష్యం రైతులను నిండా ముంచుతున్నది. ఇలా అన్నీ కలిసి రైతులపై ఆర్థికంగా మోయలేని భారం పడి చివరకు నష్టం కలిగిస్తున్నది.**

**- వరంగల్, మే 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**



వర్ధన్నపేట మండలం ఇల్లందు మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

### ఖర్చుల భారం తడిసి మోపెడు..

రైతులు పంటలు పండించేందుకు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తున్నది. యాసంగిలో వరి పంటను కోసుకునే సమయంలోనే రెండు మూడు రోజులు క్రితం కురిసిన వానలకు పొలాలు, వడ్లు తడిసిపోయాయి. రైతులు వడ్లను పొలాల నుంచి కొనుగోలు కేంద్రాలకు తీసుకుపోయేందుకు అరిగోస పడుతున్నారు. కూలీల ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు టైర్ల యంత్రాలకు బదులుగా చైన్ మిషన్‌లతో వరి కోతలు చేయించాల్సి వస్తున్నది. టైర్ల మిషన్‌కు గంటకు రూ.2 వేలు అయితే చైన్ మిషన్‌కి గంటకు రూ.3,500 చెల్లించాల్సి వస్తున్నది. ప్రతికూల వాతావరణంతో ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. ఇప్పుడు చేతికొచ్చిన పంటను ఇంటికి తెచ్చుకునేందుకు కోతల యంత్రాలకు చెల్లించే చార్జీలతో పెట్టుబడి ఖర్చు ఇంకా పెరుగుతున్నది.

- ధాన్యం కొనుగోళ్లలో అంతులేని నిర్లక్ష్యం
- అరిగోస పడుతున్న అన్నదాతలు
- కేంద్రాల్లో రోజుల తరబడి పడిగాపులు
- తేమ పేరుతో నిర్వాహకుల ఇబ్బందులు

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నారు. అకాల వానలతో వడ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు, అక్కడ కాంటాలు పెట్టించేందుకు రైతులపై ఆర్థికంగా అధికంగా భారం పడుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలు సరిగ్గా పనిచేయడం లేదు. అవసరమైనన్ని బార్దన్లు( సంచులు) లేకపోవడంతో వడ్ల కాంటాలు కావడం లేదు. వడ్లను కొనుగోలు కేంద్రాల్లో పోసి 15 రోజులు గడుస్తున్నా కాంటాలు వేయడం లేదు. కేంద్రాలకు వచ్చే వడ్లు, వాటికి అవసరమైన బస్తాలు ఎన్ని అనేది అంచనా వేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. కాంటా కోసం ఎక్కువ రోజులు వేచిచూడాల్సి రావడంతో ఇదే అదునుగా నిర్వాహకులు, మిల్లర్లు కలిసి రైతుకు నష్టం చేస్తున్నారు. కొనుగోలు చేసిన వడ్లను మిల్లులకు తరలించే విషయంలోనూ తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే వడ్ల పరిమాణానికి తగినట్లుగా లారీలను సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కారణాలు ఏమైనా వడ్ల కొనుగోలు కోసం సర్కారు కేంద్రాలకు వెళ్లిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనల పేరుతో నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. వడ్ల బస్తాలతో 41 కిలోల చొప్పున తూకం వేయాలి. కానీ తేమ పేరుతో ఎక్కువ తీసుకొని రికార్డులో తక్కువ రాస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై ఒక్కో బస్తాలో 42 కిలోల 200 గ్రాముల చొప్పున తూకం పెడుతున్నారు. హమాలీలు, నిర్వాహకులకు ఎంతోకొంత ముట్టజెబితేనే కాంటాలు పెడుతున్నారు. పరిశీలన పేరుతో అధికారులు ఎన్నిసార్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చినా అక్కడ రైతుకు జరిగే నష్టాన్ని ఎవరూ అరికట్టడం లేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో యాసంగి వరి సాగుకు పెట్టుబడి ఎక్కువ కాగా దిగుబడి మాత్రం తగ్గింది. పండిన కొద్ది పంటనైనా అమ్ముకుందామంటే నిబంధనల పేరుతో రైతులకు నష్టం చేస్తున్నారు.



వర్ధన్నపేట కొనుగోలు కేంద్రంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

వడ్లను పూర్తిగా ఆరబెట్టి తీసుకొస్తేనే తూకం వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిబంధన పెట్టింది. నిర్వాహకులు దీనిని ఆసరా చేసుకొని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. తేమ శాతం 14 ఉన్నా సాకులు చెప్పి కాంట వేయడం లేదు. వడ్లను తర

### తేమ పేరుతో కొర్రీలు

లించేందుకు అవసరమైన బస్తా సంచులు రాకపోవడంతో నిర్వాహకులు తేమ పేరు చెప్పి కాంటాలను వాయిదా వేస్తున్నారు. వడ్లను పూర్తిగా ఆరబెట్టేందుకు రోడ్లపైన, బహిరంగ స్థలాల్లో పోస్తున్నారు. వాతావరణ మార్పులతో ఎప్పుడు పడితే అప్పుడు వానలు వస్తున్నాయి. పొద్దంతా ఎండిన వడ్లు సాయంత్రం తడిసిపోతున్నాయి. వడ్లను ప్రతి రోజు పొద్దున ఆరబోయడం, సాయంత్రం దగ్గరగా పోయడంతో కూలీలకు ఎక్కువ ఖర్చు అవుతున్నది. రైతులు ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.300 చెల్లించి కూలీలతో తూర్పార పట్టిస్తున్నారు. వడ్లను ఆరబెట్టేందుకు 10 ట్రాక్టర్ల వడ్లు ఉన్న రైతు రోజుకు రూ.3 వేలు చెల్లించాల్సి వస్తున్నది.

# మళ్లీ వానతో రైతుల్లో వణుకు



- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వర్ధన్నపేటలో పిడుగుపడి హమాలీ మృతి

కొడకండ్లలో కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

నమస్తే నెట్‌వర్క్ : ఉమ్మడి జిల్లాలో శనివారం సాయంత్రం పలుచోట్ల గాలివాన వర్షం కురిసింది. వరుస వర్షాలతో రైతుల్లో వణుకు పుడుతోంది. జనగామ జిల్లా కొడకండ్లలోని వ్యవసాయ మార్కెట్‌లో టార్పాలిన్లు లేక ఆరబోసిన ధాన్యం తడిసి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం నీటిపాలైంది. రాయపర్తి మండలం కొండాపురంలో బండారి సురేందర్ ఇంటి ఆవరణలో చెట్టు విరిగి విద్యుత్‌లైన్‌పై పడడంతో స్తంభం నేలకూలింది. పిడుగుపాటుకు మహబూబ్‌నగర్‌లో రైతు ఎల్కపల్లి యాకయ్యకు చెందిన రూ.65 వేల విలువైన దుక్కిటెద్దు మృతిచెందింది. ఇక హనుమకొండలో ఉదయం ఎండ దంచికొట్టగా మధ్యాహ్నం కొన్ని ప్రాంతాల్లో వర్షం పడి భిన్నమైన వాతావరణం కనిపించింది. ఒక్కసారిగా వాన పడడంతో రోడ్లు జలమయమవగా వాహనదారులు తడిసిముద్దయ్యారు.

### కొనుగోలు కేంద్రంలోనే కుప్పకూలాడు..

వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని కోనాపూర్ కొనుగోలు కేంద్రంలో శనివారం పిడుగు పడి హమాలీ కార్మికుడు బిట్టు(30) అక్కడికక్కడే మృతిచెందాడు. కూలీలంతా ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడిది బీహార్ రాష్ట్రం శాలన్‌పూర్ ప్రాంతం కాగా, అతడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మృతి చెందిన బీహార్ హమాలీ కార్మికుడు



హనుమకొండ రెడ్డి కాలనీలో వర్షం

# దేవరుప్పుల కాంగ్రెస్‌లో వర్గపోరు..

- మండల అధ్యక్ష పదవికి 16 మంది పోటీ
- పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిపై తిరుగుబాటు



కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి నామినేషన్ పత్రాలు ఇస్తున్న ఇప్ప పృథ్వీరెడ్డి

దేవరుప్పుల, మే10 : కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి అసమ్మతి వర్గం కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది. ఆమె విధానాలు నచ్చని అనేక మంది తిరుగుబాటు చేస్తున్నారు. తాజాగా దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్ష పదవికి శనివారం నామినేషన్ల పర్వం ముగియగా, 16 మంది బరిలో నిలిచారని తెలిసింది. ఝాన్సీరెడ్డిపై తిరుగుబాటు చేసిన మండలంలోని సింగరాజుపల్లికి చెందిన ఇప్ప పృథ్వీరెడ్డి శనివారం మండల అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు నామినేషన్లు దాఖలు చేశాయని తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మండల అధ్యక్ష పదవిలో ఉన్న పెద్ది కృష్ణమూర్తి అనంతర పరిణామాల్లో ఝాన్సీరెడ్డితో పొసగ లేదు. దీంతో కృష్ణమూర్తి తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. వందలాది మందితో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వెళ్లి ఝాన్సీరెడ్డికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించి పార్టీ పెద్దలకు పరిస్థితిని వివరించాడు. దీంతో ఇరువురి మధ్య మరింత దూరం పెరిగింది. ఈ క్రమంలో పెద్ది కృష్ణమూర్తిని పార్టీ మండల అధ్యక్ష పదవి నుంచి ఝాన్సీరెడ్డి తప్పించి నల్ల శ్రీరాంకు కట్టబెట్టింది. తనకు తలనొప్పిగా మారిన పెద్ది కృష్ణమూర్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించింది. మరోవైపు తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు, ఉస్మానియా జేఏసీ నేత సింగరాజుపల్లికి చెందిన ఇప్ప పృథ్వీరెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినీరెడ్డి గెలుపు కోసం శ్రమించారు. ఝాన్సీరెడ్డి విధానాలు నచ్చకపోవడంతో ఆమెకు వ్యతిరేకంగా పత్రికా ప్రకటనలు ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగనుండడంతో రెండు వర్గాలు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశమైంది.

# అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లపై నిరసన

**సర్వే అధికారులను అడ్డుకున్న దళితులు**



స్టేషన్‌ఘన్‌పూర్‌లో సర్వే చేస్తున్న అధికారులను నిలదీస్తున్న దళితులు

స్టేషన్ ఘన్‌పూర్, మే 10 : నిబంధనలకు విరుద్ధంగా సొంతిండ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంపై జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో దళితులు నిరసన తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాను సర్వే చేసేందుకు శనివారం అధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పడి దళితకాలనీకి వచ్చారు. వివరాలు సేకరిస్తుండగా కాలనీవాసులు పలువురు అధికారులను నిలదీశారు. నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాల్సి ఉన్నా ఉన్నవాళ్లకే ఎలా మంజూరు చేశారంటూ మండిపడ్డారు. తాము అద్దె ఇళ్లలో ఉంటున్నా ఎందుకు ఇండ్లు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. లబ్ధిదారుల జాబితా చూపించాలని కోరగా, ఎస్సీ కాలనికి 15 ఇండ్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఇందులో ఆరు ఇండ్లు ఉన్న వారికే ఉండగా వివరాలు నమోదు చేసుకుని వెనుతిరిగారు.

### పేదలకే ఇండ్లు ఇవ్వాలి సార్



పేదల ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని దళిత కాలనీకి చెందిన మాతంగి జ్యోతి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాను కోరింది. తనకు కట్నం కింద ఇంటి స్థలం ఇచ్చారని, భర్త ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని పేర్కొంది. ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అయితే కాలనీ 15 మందికి ఇండ్లు మంజూరైనట్లు జాబితా ఉందని, అందులో సగం మంది అనర్హులేనని ఆరోపించారు. పేదలకే ఇండ్లు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

*– మాతంగి జ్యోతి*



గడ్డం సమ్మయ్యను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీ కవిత

# పద్మశ్రీ గడ్డం సమ్మయ్యకు ఎమ్మెల్సీ కవిత సన్మానం

దేవరుప్పుల, మే 10 : పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆమె నివాసంలో సన్మానించి అభినందించారు. అంతరించిపోతున్న చిందు యక్షగాన కళను కాపాడేందుకు కృషిచేస్తూ కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం పద్మశ్రీ పొందడం తెలంగాణకు గర్వకారణమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చిందు యక్షగానం ద్వారా ప్రజలను చైతన్యపరిచిన సమ్మయ్య, తెలంగాణ ఆవిర్భావానంతరం ప్రభుత్వ పక్షాన అనేక చైతన్య, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారని కొనియాడారు. దేశవ్యాప్తంగా 40వేల ప్రదర్శనలు ఇచ్చిన సమ్మయ్య, అతడి బృందానికి ఎమ్మెల్సీ కవిత అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో గడ్డం సోమరాజ్, గడ్డం హిమగిరి ఉన్నారు.